సాక్షి నల్లగొండ

బుధవారం, 23, ఆగస్టు, 2023



అంతర్ రాష్ట్ర దొంగల అరెస్ట్

రోడ్ల వెంట ఉండే ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్‌రాష్ట్ర దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. - 10లో



స్పిల్‌వే పనులు పూర్తిచేయాలి

సాగర్ డ్యాం స్పిల్‌వే పనులు త్వరగా పూర్తి చేయాలని సీఈ అజయ్‌కుమార్, ఎస్ఈ నాగేశ్వర్‌రావు కోరారు. - 12లో



స్వయంభూలకు శతఘటాభిషేకం

యాదాద్రి ఆలయంలో మంగళవారం ఉదయం శతఘటాభిషేకాన్ని ఆచార్యులు వైభవంగా నిర్వహించారు. - 12లో

ఇక దూకుడే..

రెట్టించిన ఉత్సాహంతో ప్రజాక్షేత్రంలోకి బీఆర్‌ఎస్

- పెద్ద ఎత్తున కార్యక్రమాలకు ఎమ్మెల్యేల కార్యాచరణ
- అసంతృప్తులను దారిలోకి తెచ్చుకునేలా బుజ్జగింపులు
- అవసరమైతే సస్పెన్షన్లు తప్పవంటున్న పార్టీ శ్రేణులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఎన్నికల రంగంలోకి దూకేందుకు ఉమ్మడి జిల్లా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు సిద్ధమయ్యారు. 12 నియోజకవర్గాల్లో సిట్టింగ్‌లకే సీట్లు కేటాయించిన నేపథ్యంలో అభ్యర్థులు మరింత ఉత్సాహంతో ప్రజల్లోకి వెళ్లనున్నారు. సీఎం ఇచ్చిన భరోసా, అభివృద్ధి కార్యక్రమాలతో నిత్యం ప్రజల్లో ఉండేలా కార్యాచరణను రూపొందించుకుంటున్నారు. టికెట్ రాని ఆశావహులను, అసంతృప్తులను బుజ్జగింపుల ద్వారా తమతో కలిసి పనిచేసేలా ఒప్పించడం, వినకపోతే ఎలా ముందుకు పోవాలన్న దానిపైనా దృష్టి పెట్టారు.

ముందస్తు వ్యూహం..

ముఖ్యమంత్రి కేసీఆర్ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12 స్థానాలను సిట్టింగ్ ఎమ్మెల్యేలకే కేటాయించారు. అందులో బీఆర్‌ఎస్ నుంచి ఐదుగురికి మూడోసారి అవకాశం వచ్చింది. వారిలో మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, గాదరి కిషోర్ కుమార్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, గొంగిడి సునీత, పైళ్ల శేఖర్‌రెడ్డి ఉన్నారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు 2014లో కాంగ్రెస్ నుంచి గెలిచి బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆయన 2018లో బీఆర్‌ఎస్ నుంచి గెలువగా.. ఇప్పుడు రెండోసారి బీఆర్‌ఎస్ నుంచే పోటీలో ఉంటున్నారు. మిర్యాలగూడ, సూర్యాపేట, తుంగతుర్తి, హుజూర్‌నగర్, ఆలేరు, భువనగిరి నియోజకవర్గాల్లో పెద్దగా ఆశావహులు, అసంతృప్తులు లేరు. మిగతా నియోజకవర్గాల్లో కొన్ని చోట్ల అసమ్మతి ఉన్నా.. మొదట్లో సీఎం చెప్పిన మాట ప్రకారం సిట్టింగ్‌లకే సీట్లను ప్రకటించారు.

షెడ్యూల్ వచ్చేలోగానే..

ఎన్నికల షెడ్యూల్ రావడానికి ఇంకా సమయం ఉంది. ఇప్పుడే అభ్యర్థులను ప్రకటించడం ద్వారా నియోజకవర్గాల్లో స్థానికంగా ఉన్న అసంతృప్తి సద్దుమణిగేలా చూసుకునే వ్యూహం ఉన్నట్లుగా తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో పార్టీలో ఉన్న చాలా మంది నాయకులు ఆయా నియోజకవర్గాల్లో టికెట్ వస్తుందని ఆశించారు. స్వచ్ఛంద సంస్థలతో కార్యక్రమాలు చేపట్టారు. కానీ, వారికి టికెట్లను కేటాయించలేదు. ఆశావహులు తొందరపడి నిర్ణయాలు తీసుకోవద్దని, భవిష్యత్‌లో మంచి అవకాశాలు వస్తాయని సీఎం స్పష్టం చేశారు. అసంతృప్తులను బుజ్జగింపుల ద్వారా దారిలోకి తెచ్చుకునే కార్యాచరణను అమలు చేసే అవకాశం అభ్యర్థులకు దక్కింది. నోటిఫికేషన్ వచ్చి ప్రచారం ముమ్మరం అయ్యేలోగానే ఈ పనిని పూర్తి చేసుకొని ముందుకు సాగాలన్న నిర్ణయానికి వచ్చారు. ఎమ్మెల్యేలతో పాటు మంత్రి జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో ఈ కార్యాచరణను అమలు చేయనున్నారు. బుజ్జగించినా వినకపోతే మాత్రం హెచ్చరికలు, అవసరమైతే పార్టీ నుంచి సస్పెన్షన్ చర్యలకు వెనుకాడబోమనే సంకేతాలు ఇచ్చేలా కార్యాచరణ ఉండబోతుందని ఓ ముఖ్యనాయకుడు 'సాక్షి'తో పేర్కొన్నారు.

పక్కా కార్యాచరణతో వెళ్లేలా..

ఎమ్మెల్యేలంతా పక్కాగా కార్యాచరణ రూపొందించుకొని ప్రజల్లోకి వెళ్లేందుకు అభ్యర్థులకు సమయం దక్కింది. నియోజకవర్గాల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేసుకొని తిరిగి ప్రజల ఆశీస్సులు పొంది విజయం సాధించేలా ముందుకు పోయేందుకు సిద్ధమవుతున్నారు. తద్వారా ఇప్పటి నుంచే నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారాన్ని మొదలు పెట్టబోతున్నారు.



కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి. చిత్రంలో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ

నామినేషన్ల నాటికే మొదటి దశ ప్రచారం పూర్తి కావాలే

- ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రి కేసీఆర్ దిశా నిర్దేశం

బీఆర్‌ఎస్ అభ్యర్థులంతా నామినేషన్ల ప్రారంభం నాటికే మొదటి దశ ప్రచారం పూర్తి చేసుకోవాలని సీఎం కె.చంద్రశేఖర్‌రావు సూచించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థులుగా ఎన్నికల్లో బరిలో నిలువబోయే ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు మంగళవారం విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి నేతృత్వంలో ప్రగతి భవన్‌కు వెళ్లి సీఎం కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేలకు సీఎం దిశా నిర్దేశం చేశారు. ఈ నెల రోజుల్లో బీఆర్‌ఎస్ గ్రాఫ్ పెరిగిందని, అందరూ నిత్యం ప్రజల్లో ఉండేలా, వారితో మమేకం అయ్యేలా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వారికి వివరించాలని సూచించారు. రైతులు ఎక్కువగా ఉన్న జిల్లా అయినందున అభ్యర్థులంతా వారిపై దృష్టి కేంద్రీకరించి పనిచేయాలని చెప్పారు. తద్వారా ఉమ్మడి జిల్లాలోని 12 స్థానాలను గెలుచుకోవచ్చని తెలిపారు. ఆశావహులు, అసంతృప్తులు అందరినీ పిలిచి మాట్లాడి కలుపుకుపోవాలని సూచించారు. కాంగ్రెస్ బలాబలాలపైనా కేసీఆర్ ఆరాతీశారు. సీఎంను కలిసిన వారిలో మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యేలు నలమోతు భాస్కర్‌రావు, కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, శానంపూడి సైదిరెడ్డి, బొల్లం మల్లయ్య యాదవ్, గాదరి కిషోర్‌కుమార్, రవీంద్ర కుమార్, నోముల భగత్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ భరత్ కుమార్ ఉన్నారు. కాగా, మొదటగా ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు హైదరాబాద్‌లో మంత్రి జగదీష్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆ తర్వాత అందరూ కలిసి సీఎం వద్దకు వెళ్లారు.



ఉమ్మడి జిల్లా నేతలకు దిశానిర్దేశం చేస్తున్న సీఎం కేసీఆర్

న్యూస్‌రీల్

బీజేపీ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ల నియామకం



బండారు ప్రసాద్, నల్లగొండ కన్వీనర్

నల్లగొండ: బీజేపీ నల్లగొండ, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్లు, జాయింట్ కన్వీనర్లను నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నల్లగొండ పార్లమెంట్ కన్వీనర్‌గా బండారు ప్రసాద్, జాయింట్ కన్వీనర్‌గా మన్మథరెడ్డిని నియమించారు. అదేవిధంగా భువనగిరి పార్లమెంట్ కన్వీనర్‌గా బండారపు లింగస్వామి, జాయింట్ కన్వీనర్‌గా శ్రీనివాస్‌రెడ్డి, సి.నారాయణయాదవ్‌లను నియమించారు.

నేడు ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాల, కోమటిరెడ్డి పతీక్‌రెడ్డి మెమోరియల్ (కేపీఎం) ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో బుధవారం 2023–24 అకడమిక్ సంవత్సరానికి గాను ఎన్‌సీసీ క్యాడెట్లను ఎంపిక చేయనున్నట్టు 31టీ ఎన్‌సీసీ బెటాలియన్ సుబేదార్ మేజర్ ఎల్.మాధవరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన బాలురకు 1600, బాలికలకు 800 మీటర్ల పరుగు పందెం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు సర్టిఫికెట్లు, పాస్ ఫొటోలతో ఉదయం 8 గంటల వరకు హాజరు కావాలని కోరారు.

24న మినీ జాబ్‌మేళా

నల్లగొండ: జిల్లాలోని నిరుద్యోగ యువతీయువకులకు ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించేందుకు ఈనెల 24న నల్లగొండలోని ఐటీఐలో మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయ అధికారులు తెలిపారు. ఎంపిక కాబడిన వారికి రూ.10వేల నుంచి రూ.25వేల వరకు వేతనం ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇందు కోసం 10వ తరగతి నుంచి డిగ్రీ చదివి 18నుంచి 35 సంవత్సరాలు వయస్సులోపు గల స్త్రీ, పురుషులు అర్హులని తెలిపారు. జాబ్‌మేళాకు హాజరయ్యేవారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

'ఆరోగ్య మహిళ'తో 15 వేల మందికి పరీక్షలు



వైద్యులతో మాట్లాడుతున్న కొండల్‌రావు

మర్రిగూడ: మహిళల ఆరోగ్య రక్షణ కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్య మహిళ పథకం దేశానికే ఆదర్శం కానుందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ అనిమల్ల కొండల్‌రావు అన్నారు. మంగళవారం మర్రిగూడలోని సీహెచ్‌సీలో ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళ రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మార్చి 8న మహిళా దినోత్సవం రోజున ఈ కార్యక్రమం ప్రారంభమైందని, ఇప్పటి వరకు 24 మంగళవారాల్లో దాదాపు 15వేల మంది మహిళలకు అనేక వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. క్యాన్సర్ వంటి వ్యాధులను కూడా గుర్తించి సర్జరీలు చేయించామన్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కృష్ణకుమారి, వైద్యులు దీపక్, తరుణ్, రుబీనా, అరుణతార, పీహెచ్‌ఓలు సోమయ్య, విజయమ్మ, సుజాత, హెల్త్ అసిస్టెంట్లు అజయ్‌కుమార్, నవీన్‌రెడ్డి, వైద్య సిబ్బంది ఉన్నారు.

బీసీలకు తీవ్ర అన్యాయం

మిర్యాలగూడ టౌన్: సీఎం కేసీఆర్ విడుదల చేసిన బీఆర్‌ఎస్ అసెంబ్లీ అభ్యర్థుల జాబితాలో బీసీలకు తీవ్ర అన్యాయం చేసి బీసీల ద్రోహిగా మారాడని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు పోగుల సైదులుగౌడ్ అన్నారు. మంగళవారం మిర్యాలగూడ పట్టణంలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు టికెట్లు కేటాయించడంలో కేసీఆర్ పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. జనాభాలో అర శాతం ఉన్న వెలమలకు 16శాతం సీట్లు కేటాయించారని విమర్శించారు. బంగారు తెలంగాణలో బీసీలను పూర్తిగా అణచివేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ కుటుంబ పాలనకు బీసీలు చరమగీతం పాడుతారని అన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర నాయకుడు విక్రమ్‌గౌడ్, నాయకులు కొత్త వినయ్, జిల్లా కార్యదర్శి కర్నాటి శివరామకృష్ణ, నాయకులు రాధాకృష్ణ, సతీష్, గోపి, సూర్య తదితరులున్నారు.



మాట్లాడుతున్న సైదులుగౌడ్

ప్రత్యామ్నాయ ప్రణాళిక సిద్ధం చేయండి

- కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

నల్లగొండ: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సాగు నీటి కొరత ఉన్నందున వరికి బదులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ ఆదేశించారు. మంగళవారం నల్లగొండ కలెక్టరేట్‌ని ఉదయాదిత్య భవన్‌లో వ్యవసాయ, హార్టికల్చర్, సెరికల్చర్, పశుసంవర్ధక, మత్స్యశాఖ అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయా శాఖలు సమన్వయంతో పనిచేస్తూ రైతులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. వరి దాని అనుబంధ రంగాల్లో నూతన సాగు విధానాలను అవలంబించేలా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఆయా శాఖల వివరాలు, అమలు చేస్తున్న పథకాలు, అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన పూర్తి వివరాలను కలెక్టర్‌కు వివరించారు. చివరకు మత్స్య శాఖపై సమీక్షించారు. మత్స్య శాఖ పథకాలపై అవగాహన కలిగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఏఓ సుచరిత, మత్స్య శాఖ అధికారి వెంకయ్య, ఉద్యాన శాఖ అధికారిణి సంగీత లక్ష్మీ, పశుసంవర్ధక శాఖ అధికారి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులంతా ఓటుహక్కు వినియోగించుకోవాలి

వయోవృద్ధులు ప్రతిఒక్కరూ ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ అన్నారు. మంగళవారం నల్లగొండ కలెక్టర్‌లోని ఉదయాదిత్య భవన్‌లో ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా వయోవృద్ధులకు పోలింగ్ ప్రక్రియ, పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక సదుపాయాల కల్పన తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పనితీరు గురించి ప్రయోగాత్మకంగా వివరించారు. అనుమానాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు ముసాయిదా విడుదల చేసిన నేపథ్యంలో ప్రతిఒక్కరూ ఓటర్ జాబితాలో తమ పేరు ఉందా లేదా అని చెక్ చేసుకోవాలని లేకుంటే వెంటనే నమోదు చేసుకోవాలన్నారు. ఎనభై ఏళ్లు పైబడిన వయోవృద్ధులు, దివ్యాగులు తమ ఇంటి నుంచే ఓటు హక్కును వినియోగించుకునే వెసులుబాటును ఎన్నికల సంఘం కల్పించిందన్నారు. ఇందుకు ఫారం-12 'డి' నింపి తమ అభ్యర్థనను తెలియజేస్తే, పోలింగ్ అధికారి నేతత్వంలోని సిబ్బంది ఎన్నికల సమయంలో ఇళ్లకు వచ్చి సీక్రెట్ బ్యాలెట్ విధానాన్ని అనుసరిస్తూ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు. జెడ్పీ ఈసీఓ, స్వీప్ నోడల్ అధికారి ప్రేమ్ కరణ్‌రెడ్డి మాట్లాడుతూ ఓటును నోటుకు అమ్ముకోకుండా ప్రజలకు నిస్వార్థంగా సేవ చేసేవారికి వేయలన్నారు. అనంతరం సీనియర్ సిటిజన్లను కలెక్టర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహిళా, శిశు, వయోవృద్ధుల, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారిణి కృష్ణవేణి, డీపీఓ విష్ణువర్ధన్ రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, నల్లగొండ నియోజకవర్గ స్వీప్ నోడల్ అధికారి లక్ష్మీనారాయణ, సీనియర్ సిటిజన్ ఫోరం, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



ఓటేయడంపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్

సీపీఎస్ విధానం రద్దుచేయాలి

కొండమల్లేపల్లి: ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీఎస్ సీపీఎస్‌ఈయూ జిల్లా అధ్యక్షుడు శిరందాసు రామదాసు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొండమల్లేపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో మంగళవారం భోజన విరామ సమయంలో టీఎస్ సీపీఎస్‌ఈయూ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల సీపీఎస్ రద్దు కోరుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో టీఎస్ సీపీఎస్‌ఈయూ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్, చంద్రయ్య, లింగారెడ్డి, లోక్యానాయక్, వెంకటయ్య, నర్సింహాచారి తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వాలు అందజేస్తున్న నాయకులు

చంద్రయాన్-3 ల్యాండింగ్‌ను వీక్షించండి

నల్లగండ: జాబిల్లిపై చంద్రయాన్-3 మిషన్ ల్యాండింగ్ సన్నివేశాన్ని వీక్షించాలని జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతి ఒక ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమాన్ని టీశాట్, నిపుణ ఛానల్ ద్వారా బుధవారం జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రత్యక్షంగా చూసేందుకు పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని పాఠశాలల్లో సాయంత్రం 5.30 గంటల నుంచి 6:30గంటల వరకు ఈ అద్భుత కార్యక్రమాన్ని వీక్షించేందుకు మండలాల విద్యా ధికారులు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

ప్రజా యుద్ధనౌక గద్దర్ జీవితం ఆదర్శనీయం



సంతాప సభలో మాట్లాడుతున్న నాగయ్య

చింతపల్లి: ప్రజా యుద్ధనౌక గద్దర్ జీవితం ఆదర్శనీయమని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య పేర్కొన్నారు. పీఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాల్‌లో గద్దర్ సంతాప సభను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గద్దర్ తన తుది శ్వాస విడిచే వరకు ప్రజా చైతన్యం కోసం పాటుపడ్డారని అన్నారు. కార్యక్రమంలో పీఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చెల్లం పాండురంగారావు, తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు పులిబిడ్డ శ్రీనివాస్, జంగయ్య, అబ్బయ్య, శ్రీనివాస్, అరుణ, రాజేశ్, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం



మిర్యాలగూడ : కెమెరాలను ప్రారంభిస్తున్న ఎస్పీ



తిరుమలగిరి: స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ

- జిల్లా ఎస్పీ అపూర్వరావు

మిర్యాలగూడ అర్బన్: నేరాల నియంత్రణంలో సీసీ కెమెరాల పాత్ర ఎంతో కీలకమైందని జిల్లా ఎస్పీ అపూర్వరావు అన్నారు. మంగళవారం మిర్యాలగూడ పట్టణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. మిర్యాలగూడ పట్టణంలోని ప్రధాన కూడళ్లలో మొత్తం 32 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో వాటిని టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు అనుసంధానం చేసి మానిటరింగ్ చేస్తామని తెలిపారు. అవసరాలకు తగినట్లు మరిన్ని సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. నూతనంగా ఇళ్లు నిర్మించుకునే వారు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చొరవ చూపాలన్నారు. ఇక మిర్యాలగూడ పూర్తిగా సీసీ కెమెరాల నిఘాలో ఉంటుందని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలిగించే అవాంఛనీయ సంఘటనలు జరగనీయబోమని, పోలీస్ సిబ్బంది నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటారని భరోసా ఇచ్చారు.

పోలీస్ స్టేషన్లకు వచ్చేవారిని గౌరవించాలి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రతి ఒక్కరినీ గౌరవించాలని జిల్లా ఎస్పీ అపూర్వరావు సూచించారు. మంగళవారం ఆమె తిరుమలగిరిసాగర్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించి, కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట మిర్యాలగూడ డీఎస్పీ వెంటకగిరి, హాలియా సీఐ గాంధీ నాయక్, ఎస్ఐ సురేష్ కుయార్, సిబ్బంది ఉన్నారు.

'బయోమెట్రిక్' వద్దు

నల్లగొండ టౌన్: భవన, ఇతర నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు లేబర్ కార్డులు మంజూరు చేయడంలో బయో మెట్రిక్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు బొంగరాల నర్సింహ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక డిప్యూటీ లేబర్ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసినప్పటికీ ప్రమాదాలు జరిగినప్పుడు సెస్ నిధుల నుంచి వారికి ఇవ్వడం లేదన్నారు. పాత పద్ధతిలోనే లేబర్ కార్డులను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి నగేష్, కత్తుల చంద్రశేఖర్, జానపాటి శంకర్, డి.హరికృష్ణ, శ్రవణ్, డి.వి.చారి, పవన్, మల్లేష్, వీరయ్య పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

పత్తి రైతుకు చినుకు చింత!



పైరుకు నీరు కడుతున్న ఈ చిత్రంలోని రైతు పేరు చీమల వెంకన్న. ఈయనది శాలిగౌరారం మండలం తుడిమిడి గ్రామం. ఈయనకు గ్రామంలో ఎర్రనేల కలిగిన నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో రెండెకరాల్లో వరి, మరో రెండెకరాల్లో పత్తిపంటలను సాగుచేశాడు. కొన్ని రోజులుగా వర్షాలు కురువకపోవడంతో పత్తిచేను పూర్తిగా వాడిపోయింది. దీంతో కళ్లముందే పంట వాడుబడుతుంది. పైగా పత్తిచేనులో కలుపుతీసి ఎరువులు వేద్దామంటే భూమిలో తేమలేదు. ఈ క్రమంలో చేను ఏపుగా ఎదిగే దశ నిలిచిపోయింది. దీంతో పంటలను కాపాడుకునేందుకు తనకున్న బోరునీటిని వరిచేనుకు నిలిపివేసి మూడు రోజులుగా పత్తి చేనును తడులు ఇస్తున్నాడు. వర్షం ఎప్పుడు పడుతుందోనని ఆశగా ఎదురుచూస్తున్నానని రైతు వెంకన్న తన ఆవేదనను వ్యక్తం చేశాడు. – శాలిగౌరారం

- రెండు వారాలుగా జాడలేని వర్షం
- వాడిపోతున్న పత్తిచేలు
- 14 మండలాల్లో సాధారణ, 13 చోట్ల లోటు వర్షం
- వరుణుడి కరుణ కోసం ఆశగా చూస్తున్న రైతులు

నల్లగొండ అగ్రికల్చర్: రెండు వారాలుగా వరుణుడు మొహం చాటేయడంతో వర్షం జాడ లేకుండా పోయింది. దీంతో జిల్లావ్యాప్తంగా పత్తిపంట సాగు చేసిన రైతులకు చినుకు చింత తీరడం లేదు. సీజన్ పూర్తి కావస్తున్నప్పటికీ వరుణుడు కరుణ చూపకవడంతో తాము సాగుచేసిన పత్తి చేలు వాడుబడుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది వానాకాలం సీజన్ ప్రారంభంలో సరైన వర్షాలు కురవలేదు. ఆలస్యంగా కొద్దిపాటి వర్షం కురడడంతో జూన్ చివరి వారం, జూలై మొదటి వారంలో జిల్లాలోని రైతులు పత్తి గింజలు విత్తారు. అనంతరం అడపాదడపా కురుస్తున్న చిరుజల్లులకు ప్రస్తుతం పత్తిచేలు మూరెడు ఎత్తు వరకు పెరిగాయి. దీంతో వివిధ ప్రాంతాల్లోని రైతులు తమ చేలల్లో కలుపు నివారణకు గుంటుకలు తోలుకుని ఎరువులు సైతం పెట్టుకున్నారు. కానీ పక్షం రోజుల నుంచి ప్రతిరోజూ మబ్బులు కమ్ముకుంటున్నప్పటికీ వర్షం మాత్రం పడడం లేదు. దీంతో జిల్లా వ్యాప్తంగా పత్తిచేలు వాడుపట్టి ఎండే స్థాయికి చేరుకుంటున్నారు.

5.87లక్షల ఎకరాల్లో సాగు..

జిల్లా వ్యాప్తంగా 5,87,158 ఎకరాల్లో రైతులు పత్తిని సాగు చేశారు. అత్యధికంగా నాంపల్లి, గుర్రంపోడు చింతపల్లి, చండూరు, దేవరకొండ, మర్రిగూడ, చందంపేట, నార్కట్‌పల్లి, చిట్యాల, మునుగోడు, పెద్దవూర, తిరుమలగిరి సాగర్, శాలిగౌరారం, పీఏపల్లి, గుండ్లపల్లి, అనుముల-హాలియా, నల్లగొండ మండలాల్లో సాగు చేశారు. ఇప్పటికే పూత, కాయదశలో ఉండాల్సిన పత్తిచేలు వర్షాభావ పరిస్థితుల కారణగా జానేడు, మూరెడు మాత్రం పెరిగి భూమి గెట్టి బారి పోయింది. ప్రతి రోజూ మబ్బులు కమ్ముకుంటూ ఉంటుడడంతో వర్షం పడుతుందేమోనని రైతులు వర్షాల ఆశగా ఆకాశంవైపు చూస్తున్నారు. మరో వారం రోజుల పాటు వర్షం రాకుండా ఉంటే చేలు పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు.

13 మండలాల్లో లోటు వర్షం

ప్రస్తుత వానాకాలం సీజన్‌లో 14 మండలాల్లో సాధారణ వర్షం కురిసినప్పటికీ 13 మండలాల్లో లోటు వర్షం కురిసింది. చిట్యాల, కట్టంగూరు, కేతేపల్లి, తిప్పర్తి, నల్లగొండ, కనగల్, మునుగోడు చింతపల్లి, గుర్రంపోడు, నిడమనూరు, మాడుగుపల్లి, దామరచర్ల, పీఏపల్లి, చందంపేట మండలాల్లో సాధారణ వర్షం కురిసింది. చందూరు, అనుముల(హాలియా), త్రిపురారం, వేములపల్లి, మిర్యాలగూడ, అడవిదేవులపల్లి, తిరుమలగిరిసాగర్, పెద్దవూర, నేరెడుగొమ్ము, కొండమల్లేపల్లి, దేవరకొండ, గుండపల్లి, గట్టుప్పల్ మండలాల్లో లోటువర్షం కురిసింది. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పత్తిచేలు వాడుపడుతున్నాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం లేకపోలేదు. ఎకరాకు రెండు, మూడు క్వింటాళ్ల దిగుబడి కూడా రాదని, దీంతో పెట్టుబడులు కూడా పూడని పరిస్థితి ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చందంపేట మండల కేంద్రం పరిధిలో వాడుబడిన పత్తిచేను

పెట్టుబడి కూడా పూడదు



వర్షాలు లేకపోవడంతో పత్తిచేలు పూర్తిగా వాడుపడుతున్నాయి. ఇప్పుడు వర్షాలు కురిసినా చేలు అంతగా పెరగవు. ఎకరానికి రెండు క్వింటాళ్లు కూడా దిగుబడి రాదు. పెట్టుబడులు కూడా పూడని పరిస్థితి నెలకొంది.

– రమేష్, రైతు, అన్నారం, నల్లగొండ మండలం

క్లుప్తంగా

కుక్కల దాడిలో 15 మేకలు మృతి



ఘటనాస్థలిలో మేకల కళేబరాలు

చౌటుప్పల్ : పిచ్చికుక్కల దాడిలో మేకలు మృతిచెందాయి. ఈ ఘటన చౌటుప్పల్ మండల పరిధిలోని మసీదుగూడెం గ్రామపంచాయతీ మధిర శేరీల గ్రామంలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గుండెబోయిన లక్ష్మయ్య రోజువారీ మాదిరిగా తన మేకలను దొడ్లో తోలి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో కుక్కలు దొడ్లోకి వెళ్లి దాడికి పాల్పడ్డాయి. దీంతో 15మేకలు మృతిచెందాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పశువైద్యాధికారి డాక్టర్ పృథ్వీరాజ్ ఘటనా స్థలానికి వెళ్లి పంచనామా నిర్వహించారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య



రంజిత్ కుమార్ (ఫైల్)

కట్టంగూర్ : అప్పుల బాధతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కట్టంగూరు మండలం అయిటిపాముల గ్రామంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అయిటిపాముల గ్రామానికి చెందిన కొప్పూరి రంజిత్‌కుమార్(30) ఓ రాజకీయ పార్టీలో కోశాధికారిగా పనిచేస్తున్నాడు. ఇల్లు గడవటం కష్టంగా మారటంతో గ్రామస్తుల వద్ద సుమారు రూ.6లక్షల వరకు అప్పు చేశాడు. చేసిన అప్పులు తీర్చే మార్గం కనిపించక మానసిక వేదనకు గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో మంగళవారం తెల్లవారు జామున ఇంటిపై కప్పు ఐరన్‌పైపునకు చీరతో ఉరివేసుకున్నాడు. కొద్ది సేపటికి కుటుంబ సభ్యులు గమనించగా అప్పటికే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య గంగ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

గురుకుల పాఠశాలలో విచారణ

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ పట్టణంలోని బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటనపై మంళవారం బాలల సంక్షేమ సమితి అధికారులు విచారణ నిర్వహించారు. ఆత్మహత్యకు గల కారణాలను తోటి విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు తెలియజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సమితి చైర్మన్ రమణారావు, డీసీపీయూ, చైల్డ్‌లైన్ సిబ్బంది పాల్గొన్నారు.

బావిలో పడి ఆర్‌ఎంపీ మృతి

మేళ్లచెరువు : బావిలో పడి ఆర్‌ఎంపీ మృతిచెందాడు. ఈ ఘటన మేళ్లచెరువు మండలంలోని కందిబండ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. కందిబండ గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ పిన్నపురెడ్డి సైదిరెడ్డి (52) ఉదయం వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. పొలానికి నీళ్లు పెట్టేందుకు విద్యుత్ మోటార్ ఆన్ చేసే క్రమంలో జారి పక్కనే ఉన్న బావిలో పడిపోయాడు. కొద్ది సేపటి తర్వాత స్థానిక రైతులు గమనించగా అప్పటికే మృతిచెందాడు. మృతుడికి భార్య ఉన్నట్లు తెలిపారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఇద్దరు అంతర్ రాష్ట్ర దొంగల అరెస్ట్

- నిందితులపై నల్లగొండ జిల్లాలో 20కి పైగా చోరీ కేసులు
- రహదారుల వెంట తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్
- రూ.60లక్షల సొత్తు రికవరీ
- వివరాలు వెల్లడించిన ఎస్పీ అపూర్వరావు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అపూర్వరావు



పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి ఆభరణాలు

మిర్యాలగూడ అర్బన్ : రహదారుల వెంట ఉండే ఇళ్లనే టార్గెట్‌గా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్ రాష్ట్ర దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం మిర్యాలగూడ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టి నల్లగొండ ఎస్పీ అపూర్వరావు వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా నరసారావుపేట ఎస్‌టీఓ కాలనీకి చెందిన జంగా వెంకట్‌రావు, అదే జిల్లా రాజుపాలెం మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన దమ్ము సుధాకర్ వృత్తిరీత్యా కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. జల్సాలకు అలవాటు పడిన వీరు సులువుగా డబ్బులు సంపాదించాలని చోరీలకు పాల్పడుతున్నారు. 2011లో నరసారావుపేటలో దొంగతనం చేసి జైలు జీవితం గడిపారు. బయటికి వచ్చాక టీ స్టాల్ నడిపినా ప్రయోజనం లేకపోవడంతో మళ్లీ దొంగతనాలు మొదలు పెట్టారు. అయితే పల్నాడులో దొంగతనాలు చేస్తే దొరికిపోతామనే ఉద్దేశంతో మకాం నల్లగొండ జిల్లాలోని మిర్యాలగూడ పట్టణానికి మార్చారు.

టంగ్ క్లీనర్‌తో టవర్‌బోల్ట్ తొలగించి..

నిందితులిద్దరూ రహదారుల వెంట తాళాలు వేసి ఉన్న ఇళ్లనే టార్గెట్‌గా చేసుకుని చోరీలకు పాల్పడ్డారు. ఎంపిక చేసుకున్న ఇంటి ఆవరణలోకి అర్ధరాత్రి సమయంలో ప్రవేశించి తొలుత కిటికీ అద్దాలను ఇనుపరాడ్డుతో పగులగొడతారు. అనంతరం కర్రకు టంగ్ క్లీనర్ కట్టి దాని సహాయంతో కిటికీ టవర్‌బోల్ట్ తీసి ఆపై ఇంటి లోపలికి ప్రవేశిస్తారు. అనంతరం ఇంట్లోని విలువైన బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదును అపహరిస్తారు. ఇలా దొంగలించిన బంగారు ఆభరణాలను నరసారావుపేటలోని ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టి వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తున్నారు. వీరు మిర్యాలగూడలో 16కు పైగా ఇళ్లలో చోరీలకు పాల్పడ్డారు. ఇటీవల మిర్యాలగూడలో నిఘా ఎక్కువకావడంతో మకాం నల్లగొండ జిల్లా కేంద్రానికి మార్చి నాలుగు ఇళ్లలో ఇదే తరహాలో చోరీలు చేశారు.

తనిఖీల్లో పోలీసులకు చిక్కి..

ఇటీవల మిర్యాలగూడలో చోరీ చేసిన బంగారు ఆభరణాలను క్రయించేందుకు అప్పటికే అపహరించిన మారుతి స్విఫ్ట్ కారులో ఇద్దరు నిందితులు హైదరాబాద్‌కు బయలుదేరారు. మార్గమధ్యలో మిర్యాలగూడ మండలం నందిపాడు చౌరస్తాలో వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించారు. వీరి కారును నిలిపి ధ్రువపత్రాలు చూపించాలని కోరగా పొంతనలేని సమాధానాలు చెప్పారు. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా చోరీల నేరాలను అంగీకరించారు. నిందితుల నుంచి 83 తులాల బంగారం, 8 తులాల వెండి, మారుతి షిఫ్ట్‌కారు, రాయల్ ఇన్‌ఫీల్డ్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.60 లక్షలు ఉంటుందని ఎస్పీ తెలిపారు. కేసును ఛేదించిన మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి, సీఐలు నర్సింహారావు, రాఘవేందర్, నల్లగొండ సీసీఎస్ పోలీసు అధికారులు జితేందర్ రెడ్డి, లక్ష్మయ్య, ఎస్‌ఐలు కృష్ణయ్య, రామ్మూర్తి, శివకుమార్, రాంబాబు, కానిస్టేబుళ్లు విష్ణువర్ధనగిరి, వెంకటేశ్వర్లు, నరేష్, అక్బర్, రామకృష్ణ, రవి, వెంకటేశ్వర్లు, హోంగార్డు సోమ్లానాయక్, సైదా నాయక్, దయాకర్‌ను ఎస్పీ అభినందించారు.

తాళం వేసిన ఇళ్లలో చోరీ



దుర్గాప్రసాద్ ఇంట్లో చిందరవందరగా వస్తువులు

కట్టంగూర్ : గుర్తుతెలియని వ్యక్తులు మండలంలోని అయిటిపాముల గ్రామంలో హైవే పక్కనే ఉన్న ఇంట్లో సోమవారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన ఎన్ దుర్గాప్రసాద్ రెండు రోజుల క్రితం తన కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లారు. మంగళవారం తిరిగి ఇంటి వచ్చేసరికి తలుపుల తాళం పగులగొట్టి ఉండటం గమనించాడు. లోనికి వెళ్లి చూసేసరికి బీరువా తాళం పగులగొట్టి అందులో ఉంది. అందులోని రూ.50 వేల నగదుతో పాటు మూడు తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. చోరీ జరిగిందని గుర్తించి స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు పేర్కొన్నాడు.

తూప్రాన్‌పేటలో..

చౌటుప్పల్ : చౌటుప్పల్ మండల పరిధిలోని తూప్రాన్‌పేట గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగతనం జరిగింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం...గ్రామానికి చెందిన దేవరశెట్టి నర్సింగ్‌రావు కుటుంబసభ్యులతో కలిసి బోనాల పండుగ నిమిత్తం రంగారెడ్డి జిల్లా కొత్తగూడెం గ్రామంలోని అత్తగారి ఇంటికి వెళ్లాడు. పండుగ ముగిసిన అనంతరం మంగళవారం ఉదయం ఇంటికి చేరుకున్నారు. అప్పటికే ఇంటి తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించారు. లోనికి వెళ్లి పరిశీలించగా ఇంట్లో భద్రపరచిన తులంన్నర విలువైన బంగారు ఆభరణాలు, 12తులాల వెండి ఆభరణాలు, 02వేల రూపాయల నగదు దొంగతనానికి గురైనట్టుగా గుర్తించారు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



రవి మృతదేహం

నూతనకల్ : చేపల వేటకు వెళ్లిన ఓ యువకుడు విద్యుదాఘాతంతో మృతిచెందాడు. నూతన్‌కల్ మండల పరిధిలోని వెంకెపల్లిలో మంగళవారం చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. వెంకెపల్లికి చెందిన దూదిగం మల్లయ్య కుమారుడు రవి (28) గ్రామ శివారులోని సంగెం చెరువు అలుగు నీటి ప్రవాహంలో చేపలు పట్టేందుకు వెళ్లాడు. కర్రకు విద్యుత్ తీగ కట్టి చేపల వేట సాగిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై నీట మునిగి మృతిచెందాడు. పక్కనే పొలంలో తిరుగుతున్న రైతు గమనించి గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని బయటికి తీశారు. ఒక్కగానొక్క కొడుకు తమ కళ్ల ఎదుటే మృతిచెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

టిప్పర్ డ్రైవర్‌కు ఆరు నెలల జైలు

చివ్వెంల(సూర్యాపేట) : టిప్పర్‌తో ఢీకొట్టి ఓ వ్యక్తి మృతికి కారణమైన డ్రైవర్‌కు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ సూర్యాపేట జిల్లా కోర్టు జూనియర్ సివిల్ జడ్జి కామిశెట్టి సురేష్ మంగళవారం తీర్పుచెప్పారు. సూర్యాపేటలోని వెంకటేశ్వర్‌కాలనీకి చెందిన తీగల సుశీందర్‌రెడ్డి బ్యాంక్ ఆఫ్ బరోడాలో సెక్యూరిటీ గార్డ్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగానే విధులకు స్కూటీపై వెళ్తుండగా కుడకుడలో సాయిపటేల్ షాపు ఎదురుగా వెనుకనుంచి వస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. ప్రమాదంలో స్కూటీ నడుపుతున్న సుశీందర్ రెడ్డి కింద పడగా అతడిపైనుంచి టిప్పర్ చక్రాలు వెళ్లగా అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి అల్లుడు తాటికొండ రమేష్‌రెడ్డి ఫిర్యాదు మేరకు అప్పటి టౌన్ ఎస్‌ఐ భిక్షపతి కేసు నమోదు చేసి విచారణ జరిపారు. సీసీ కెమెరాల ఆధారంగా టిప్పర్‌ను గుర్తించి, డ్రైవర్ ధరావతు పాండునాయక్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. జడ్జి పలువురు సాక్షులను విచారించి పీపీ హేమలత వాదనలతో ఏకీభవిస్తూ నిందితుడికి ఆరు నెలల జైలు శిక్ష రూ.వెయ్యి జరిమానా విధించారు.పీపీకి కోర్టు కానిస్టేబుల్ గన్న ప్రతాప్ వర్మ సహకరించారు.

బీఎస్పీలో ఎంఎస్ఎస్ అధ్యక్షుడి చేరిక



ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సమక్షంలో బీఎస్పీలో చేరుతున్న నగేష్

తుంగతుర్తి: తుంగతుర్తి మండల కేంద్రానికి చెందిన మాదిగ నవనిర్మాణ సమితి (ఎంఎన్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు పాల్వాయి నగేష్ మంగళవారం బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పాల్వాయి నగేష్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో నెలకొన్న రాజకీయ పరిస్థితుల్లో మెజార్టీ వర్గానికి న్యాయం జరగాలన్నా, బడుగు బలహీన వర్గాలకు రాజకీయ అస్తిత్వం స్థిరపడాలన్న బహుజన సమాజ్ పార్టీ ఒక్కటే మార్గమన్నారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నాయకత్వంలో బహుజన రాజ్యాధికారం సాధిస్తామన్నారు. తెలంగాణలో దొరల రాజ్యాన్ని కూలదోసి ప్రవీణ్‌కుమార్ నాయకత్వంలో బహుజన రాజ్యాన్ని సాధించడమే తన లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బుడిగ మల్లేష్‌యాదవ్, నల్లగొండ జిల్లా బీఎస్పీ ఇంచార్జ్ ఆదిమల్ల గోవర్ధన్ పాల్గొన్నారు.

మోటారు చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ట్రైనీ ఐపీఎస్ అధికారి శివం ఉపాధ్యాయ

బొమ్మలరామారం : చోరీ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ట్రైనీ ఐపీఎస్ అధికారి, బొమ్మలరామారం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ శివం ఉపాధ్యాయ మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలు వెల్లడించారు. బొమమలరామరం మండలంలోని తిర్మలగిరి గ్రామ సమీపంలో గల అనురాగ్ స్టోన్ క్రషర్ కొంతకాలంగా మూత పడిఉంది. ఈ నెల 15న క్రషర్‌కు గల ఇనుప కంచెను తొలగించిన దుండగులు 40 హెచ్‌పీ మోటారును చోరీ చేశారు. విషయం తెలుసుకుని క్రషర్ యాజమాని మోడిపల్లి చిన్న రమణ ఈ నెల 18న పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఈ నేపథ్యంలో ట్రైనీ ఐపీఎస్ అధికారి శివం ఉపాధ్యాయ, ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి సిబ్బందితో కలసి మంగళవారం మండలంలోని నాగినేనిపల్లి గ్రామంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈసీఐఎల్, కాప్రాలో నివాసం ఉంటున్న బీబీనగర్ మండలం జియాపల్లి తండాకు చెందిన బానోత్ రవి కుమార్ పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించాడు. రవి కుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా స్టోన్ క్రషర్‌లో మోటారు చోరీ చేసింది తానేనని ఒప్పుకున్నాడు. పోలీసులు అతడి నుంచి మోటారును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు రిమాండ్ చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి సిబ్బంది ఉన్నారు.

రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంపై హైకోర్టు స్టే

భువనగిరి: భువనగిరి మండలంలోని రాయగిరి గ్రామం నుంచి సుమారు 15 కిలోమీటర్ల మేర రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి సంబంధించిన పనులపై మంగళవారం హైకోర్టు స్టే ఇచ్చింది. గత సంవత్సరం రాయగిరికి చెందిన రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న 29 మంది భూ బాధితులు గత సంవత్సరం మార్చి 10న అలైన్‌మెంట్ మార్చాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వీరి తరఫున సీనియర్ న్యాయవాది బ్రహ్మదండి రమేష్ కోర్టులో వాదించారు. పిటిషన్‌పై రెండు సార్లు విచారణ జరగగా, నాలుగు సార్లు వాయిదా పడింది. మంగళవారం హైకోర్టులో సింగిల్ బెంచ్‌లో విచారణకు వచ్చిన అనంతరం భూ బాధితుల తరఫున వాదనలు విన్న అనంతరం జడ్జి సుధీర్‌కుమార్ స్టే విధించినట్లు రైతు తంగళ్లపల్లి రవికుమార్ తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వం పలు అభివృద్ధి పనుల కోసం భూములను తీసుకుందని రైతులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

మిర్యాలగూడ అర్బన్ : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. ఈ సంఘటన మిర్యాలగూడ పట్టణంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. త్రిపురారం మండలం నీలాయిగూడెం గ్రామ పంచాయతీ గంటారావుపేటకు చెందిన కనకం మహేష్(21) మిర్యాలగూడలోని ఇందిరమ్మ కాలనీ జంక్షన్ నుంచి ఫ్లై ఓవర్ వైపునకు స్కూటీపై వస్తున్నాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ప్రమాదంలో మహేష్ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. రోడ్డుపై ట్రాఫిక్ అంతరాయం కావడంతో వన్‌టౌన్ ఎస్ఐ శ్రీనునాక్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు ఆ ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ప్రధానోపాధ్యాయుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న విద్యాశాఖ కమిషనర్ దేవసేన

భువనగిరి: ప్రభుత్వ పాఠశాలల నిర్వహణలో ప్రధానోపాధ్యాయుల పాత్ర కీలకమని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ దేవసేన అన్నారు. భువనగిరి లోని వెన్నెల కళాశాలలో ఉన్నతి కార్యక్రమంపై ప్రధానోపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించి మాట్లాడారు. ఉన్నతి కార్యక్రమం ద్వారా ఎంతో మంది విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలను పెంపొందించవచ్చన్నారు. విద్యార్థులకు తరగతి విద్యాబోధన సక్రమంగా జరగలన్నారు. ప్రధానోపాధ్యాయులు సబ్జెక్టు ఉపాధ్యాయులకు సూచనలు చేసి విద్యార్థుల అభ్యసనంలో మార్పులు తీసుకురావాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను ఉన్నతి కార్యక్రమం ద్వారా తీర్చిదిద్దాలన్నారు. అంతకుముందు శిక్షణ కార్యక్రమంపై ప్రధానోపాధ్యాయుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఈఓ నారాయణరెడ్డి ఉన్నారు.

ఈవీఎంలపై అవగాహన

ఆలేరురూరల్: ఆలేరు పట్టణ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ సిటిజన్లకు ఈవీఎం, వీవీప్యాట్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి హాజరైన అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. 18 ఏళ్లు నిండిన యువత తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటరు తొలగింపు, మార్పులు, చేర్పులకు సంబంధించిన వివరాలు బూత్ స్థాయిలో అందుబాటులో ఉంచాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ చక్రపాణి, డిప్యూటీ తహసీల్దార్ ఇంద్రీస్, ఎంపీడీఓ జ్ఞానప్రకాష్, ఎంపీఓ సలీం ఉన్నారు.

గాయపర్చిన వ్యక్తికి నెల రోజుల జైలు శిక్ష

నిడమనూరు: భూతగాదాలో ఒకరిని నోటితో కొరికి గాయపర్చిన వ్యక్తికి నెల రోజుల జైలు శిక్ష లేదా రూ. వెయ్యి జరిమానా చెల్లించాలని నిడమనూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి స్వప్న మంగళవారం తీర్పు చెప్పారు. కోర్టు లైజన్ ఆఫీసర్ అలీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తిరుమలగిరి మండలం చింతలపాలెం ఆవాస గ్రామమైన నాగార్జునతండాకు చెందిన కొర్ర జైపాల్, కొర్ర సంజకు భూ తగాదాలు ఉన్నాయి. 2017 సెప్టెంబర్ 1న కొర్ర సంజ తన కుమారులు రామ్‌చంద్, వెంకన్నతో కలసి వ్యవసాయ భూమి వద్దకు వెళ్లారు. అప్పటికే కొర్ర జైపాల్ కుటుంబ సభ్యులతో కలసి జేసీబీతో పొలం చదును చేస్తున్నాడు. పొలాన్ని ఎందుకు చదును చేస్తున్నారని కొర్ర సంజ కుమారుడు వెంకన్న వారిని అడిగాడు. దీంతో కొర్ర జైపాల్ వచ్చి అతన్ని తిట్టి నోటితో కొరికి గాయపర్చాడు. కొర్ర వెంకన్న తండ్రి సంజ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ కుర్మయ్య కేసు నమోదు చేశారు. మంగళవారం నిడమనూరు జూనియర్ సివిల్ కోర్టులో తుది విచారణలో కొర్ర జైపాల్‌పై నేరం రుజువు కావడంతో నెల రోజుల జైలు శిక్ష అనుభవించాలని లేదా వెయ్యి రూపాయల జరిమానా చెల్లించాలని జడ్జి తీర్పులో పేర్కొన్నారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య



సరిత మృతదేహం

నాంపల్లి : కుటుంబ కలహాలతో ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన నాంపల్లి మండలం కలమందబావి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కలమందబావి గ్రామానికి చెందిన నూనావత్ రేడ్యా, సరిత(38) దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొంతకాలంగా దంపతుల మధ్య మనస్పర్థలు ఏర్పడడంతో గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే మంగళవారం ఉదయం కూడా గొడవ జరగడంతో సరిత మనస్తాపానికి గురైంది. దీంతో మనస్తాపానికి గురై తమ వ్యవసాయ బావి వద్ద ఉరేసుకుంది. సమీప వ్యవసాయ కూలీలు గమనించడంతో అప్పటికే మృతిచెందింది. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లచ్చిరెడ్డి తెలిపారు.

సంతానం కలుగడం లేదని భార్యపై దాడి

- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహిళ మృతి

మర్రిగూడ : సంతానం కలగడం లేదని ఇటీవల భర్త దాడి చేయడంతో గాయపడిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. మర్రిగూడ మండల పరిధిలోని తూర్పుతండాకు చెందిన జర్పుల లచ్చిరాంకు, కమ్మగూడ పరిధిలోని భీమ్లాతండాకు చెందిన రమావత్ లలిత(37)తో 15నేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి సంతానం కలగడం లేదు. దీంతో భార్య లలితను లచ్చిరాం నిత్యం వేధిస్తుండేవాడు. ఈనెల 12న భార్యభర్తల మధ్య సంతానం విషయమై వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో లచ్చిరాం భార్య తలను గోడకు బలంగా మోదడంతో స్పృహ తప్పి పడిపోయింది. విషయం తెలుసుకున్న లలిత కుటుంబసభ్యులు ఆమెను నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్‌కు తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందింది. మృతురాలి అన్న రమావత్ సైదులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రంగారెడ్డి తెలిపారు.

శ్మశానవాటికలో పట్టా భూమి ఉందని..

- అంత్యక్రియలు అడ్డగింత



సాగర్ రోడ్డుపై ధర్నా చేస్తున్న కోమటిగూడెం గ్రామస్తులు

త్రిపురారం : శ్మశాన వాటికలో తన పట్టా భూమి ఉందని ఓ వ్యక్తి దహనసంస్కారాలను అడ్డుకున్నాడు. త్రిపురారం మండల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. త్రిపురారం మండలంలోని కోమటిగూడేని చెందిన ఓ వ్యక్తి మంగళవారం మృతిచెందాడు. ఆ గ్రామస్తులు నాలుగు దశాబ్దాలుగా గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిలోనే దహనసంస్కారాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే చనిపోయిన కోమటిగూడేని చెందిన ఓ వ్యక్తి మృతదేహానికి కుటుంబ సభ్యులు, బంధువులు అంత్యక్రియలు నిర్వహించేందుకు శ్మశానవాటికకు వచ్చారు. అయితే, మండలంలోని దుగ్గెపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇదే భూమి సర్వే నంబర్ 275లో తనకు పట్టా ఉందని, మృతదేహానికి ఇక్కడ అంత్యక్రియలు చేయడానికి వీల్లేదని అడ్డుకున్నాడు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. అనంతరం కొమటిగూడెం గ్రామస్తులు మూకుమ్మడిగా త్రిపురారం మండల కేంద్రానికి చేరుకొని సాగర్ రోడ్డులోని పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. దీంతో రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ప్రస్తుతం తహసీల్దార్ అందుబాటులో లేకపోవడతో ఆర్ఐ గ్రామస్తులతో మాట్లాడి ప్రభుత్వ నిబంధనల ప్రకారం సదరు భూమిని సర్వే నిర్వహించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించినట్లు ఏఎస్ఐ రామయ్య తెలిపారు. అనంతరం కోమటిగూడెం గ్రామస్తులు అదే శ్మాశాన వాటికలో చనిపోయిన వ్యక్తి అంత్యక్రియలు నిర్వహించారు.

బైక్ రుణ వాయిదాలు చెల్లించలేక..

- మనస్తాపంతో పురుగుల మందు తాగిన యువకుడు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

నకిరేకల్ : బైక్ రుణ వాయిదాలు చెల్లించలేక పురుగుల మందు తాగిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. నకిరేకల్ మండలం నోముల గ్రామానికి చెందిన మాచర్ల సైదులు(29) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆరునెలల క్రితం నెలసరి వాయిదాల చెల్లింపు కింద బైక్ కొనుగోలు చేశాడు. వాహనానికి సంబంధించిన నెలసరి వాయిదాలు చెల్లింపులో జాప్యం కావడంతో సంబంధిత వ్యక్తులు ఒత్తిడికి గురిచేశారు. దీంతో మనస్తాపం చెందిన సైదులు సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. కొంత సమయం తర్వాతా ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు అతడిని నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సైదులు ఆరోగ్య పరిస్థితి విషమంగా మారడంతో నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి తల్లి విజయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ గోపికృష్ణ తెలిపారు.

ఎస్సీలకు జనరల్ స్థానాల్లో టికెట్లు ఇవ్వాలి



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట) : ప్రస్తుత జనాభా దామాషా ప్రకారం రిజర్వు స్థానాలతో పాటు నాలుగు జనరల్ స్థానాల్లోనూ ఎస్సీ వర్గానికి అసెంబ్లీ టికెట్లు ఇవ్వాలని కోరుతూ మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్‌లను మంగళవారం హైదరాబాదులో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు తల్లమల్ల హస్సేన్ మాట్లాడుతూ కాలం చెల్లిన ఎస్సీ వర్గీకరణ అంశంపై మాట్లాడకుండా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవించి దళితుల ఐక్యత, అభివృద్ధికి అన్ని పార్టీలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ కాంతయ్య, ప్రధాన కార్యదర్శులు మేకతోటి కాంతయ్య, మంచాల వెంకటస్వామి, శివరాజ్, రాష్ట్ర కార్యదర్శి శ్రీను, ఉపాధ్యక్షులు సామ రాజు, కృష్ణయ్య, ప్రసాదరావు, నాయకులు వెంకట నరసయ్య, ప్రవీణ్, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు అఖిల్, గాలయ్య పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

భువనగిరిటౌన్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు మేడబోయిన మమత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భువనగిరిలోని కలెక్టరేట్ వరకు విద్యార్థులతో ర్యాలీగా వెళ్లి కార్యాలయ గేట్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ భాస్కర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు సరిపడా మూత్రశాలలు లేవన్నారు. సంక్షేమ హాస్టల్లో పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. ప్రభుత్వం పెంచిన మెస్ చార్జీలు నేటికీ అమల్లోకి రావడం లేదని ఆరోపించారు. భువనగిరి చౌటుప్పల్, మోత్కూర్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేక చాలామంది విద్యార్థులు పై చదువుల కోసం ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజనానికి అధిక నిధులు కేటాయించాలన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్‌లో పోరాటాలను తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు చింతల శివ, కాసుల నరేష్, జిల్లా ఉపాధ్యక్షులు లావుడియా రాజు, వేముల నాగరాజు, జిల్లా కమిటీ సభ్యులు ఈర్ల రాహుల్, మేకల జలంధర్, వేముల పవన్, కంబాలపల్లి సాయి, బుగ్గ ఉదయ్ కిరణ్, పరమేశ్వర్, పుట్టల ఉదయ్, నాయకులు వసంత, లక్ష్మి, సౌందర్య, అఖిల, నాగారం శివ రాయమోజి రమణ, నేహాల్, వంశీ, కార్తీక్, అఖిల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.